# సర్వే నంబరు అరవై ఆరు

## - వైదేహి -

"సూరన్నా! సూరన్నా!" గుడిసె ముందు చేరి హడావుడిగా పిలిచాడు పెద్దయ్య.

"ఏంటి సంగతి?" అంటూ చద్దన్నం కంచంతో బయటి కొచ్చాడు సూరన్న.

"మన పూతమ్మ చెట్టుకాడికి పార్టీ లీడర్ ఎవరో వచ్చారట. మనల నందరినీ రమ్మంటు న్నాడు." పెద్దయ్య చెప్పాడు.

"దేనికో?" పచ్చి మిరపకాయ కొరుకుతూ తాపీగా అడిగాడు సూరన్న.

"ఏదో మీటింగ్ పెడుతున్నారు. అందర్నీ పిల్చుక రమ్మన్నారు. మనందరికీ లాభసాటియైన పనేదో చెప్తాడట."

"అయితే కూలి పని కెళ్ళక్కర లేదా?"

"ఒక్కరోజు కూలి లేకపోతే చస్తామా? త్వరగా రా. నే వెళ్ళి మిగిలిన వాళ్ళకు చెప్పి వస్తాను" అంటూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు పెద్దయ్య.

"ఏమిటి వీడి వెర్రి" అనుకుంటూ కంచం లోని చద్ది నీళ్ళు గడగడ తాగేసాడు సూరన్న.

జిల్లాలో అదొక మారుమూల గ్రామం. అక్కడ భూకామందులు ఎక్కువగా ఉన్నారు. హరిజనవాడలోని హరిజనులూ, గిరిజనవాడలోని గిరిజనులు అక్కడి రైతుల సేద్యం పనులు చేసుకొని జీవనోపాధి కల్పించుకున్నారు. అంతేగాక, ఆ వూరి చెరువులో తలా ఒక పాదు శివాయి భూమిని ఆక్రమించుకొని ఉన్నారు.

ఆ గ్రామంలో అందరి కంటే ఎక్కువ ఆస్తి గల వాడు రాజారెడ్డి. రాజారెడ్డికి భూ పరిమితి చట్టం కింద కొంత భూమిని వదులుకోవడం జరిగింది. ఆ భూమిని గ్రామంలోని కొందరు హరిజనులకు, గిరిజనులకు పంచారు గానీ, అది మనిషికి ఇరవై సెంట్లకు మించి రాలేదు.

సూరన్న పెద్దయ్య చెప్పిన ప్రకారం పూతమ్మ చెట్టు దగ్గర కొచ్చాడు. అప్పటికే అక్కడ హరిజనవాడలోని జనం గుమిగూడి ఉన్నారు. వాళ్ళ మధ్య ఒక పాత కుర్చీలో ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. అతను పైజామా, లాల్చీ వేశాడు. చేతిలో ఏవో కాగితాలున్నాయి. మరొక చేతిలో సిగరెట్ కాలుస్తున్నాడు.

"అందరూ వచ్చినట్లేనా?" అందరికేసి కలియ జూచి అడిగాడు అతను.

"వచ్చేసినట్లేనయ్యా! తమరు చెప్పదల్చుకున్నది చెప్పండి—మేం వింటాం." అందరి తరపున పెద్దయ్య అన్నాడు.

"నేను ఒక పార్టీకి నాయకుణ్ణి. బలహీన వర్గాలను ఉద్ధరించాలన్నది నా లక్ష్యం. అందుకోసం నాకున్న ఆస్తిపాస్తులను గూడా అమ్ముకున్నాను. మీ గ్రామంలోని ప్రజల పట్ల శ్రద్ధ చూపించిన వారెవ్వరూ లేరని తెలిసి ఈ గ్రామం వచ్చాను. ఈ గ్రామంలో రాజారెడ్డి గారికి ఎక్కువ ఆస్తి ఉందట. ఆయన భూ పరిమితి చట్టం కింద ఉన్న భూములను దొంగ లెక్కలు చూపించి దాచేసేడట. సర్వే నంబరు అరవై ఆరులో దాదాపు ఏభై ఎకరాల బీడు ఉంది. ఇది వేరుసెనగ పైరు పెట్టుకోను చాలా బాగా అనుకూలమైంది. మీలో వంద కుటుంబాల లిస్టు తయారు చేయండి. అందరికీ తలకొక ఎకరా వస్తుంది. అందరికీ కలిసి సమిష్టి వ్యవసాయ క్షేత్రాన్ని స్థాపిస్తాను. ఆయిల్ ఇంజన్లు వస్తాయి. ట్రాక్టర్లు తెప్పించి దున్నిస్తాను. ప్రభుత్వం నుండి మీకేం సాయం కావాలన్నా నేను సమకూర్చిపెట్టగలను. నాకు అన్ని వర్గాలలో మంచి పలుకుబడి ఉంది." నాయకుడు గంగరాజు చెప్తుంటే, అందరూ నోరెళ్ళబెట్టుకొని వింటున్నారు.

"బాగానే ఉంది. కానీ ఆ ఏభై ఎకరాల బీడు భూమిని ఆక్రమించుకోవడమెలా?" తల నెరిసిన ఒక వ్యక్తి అడిగాడు.

"దానికే భూమి ఆక్రమణ ఉద్యమం లేవదీస్తున్నాం. ఈ ప్రభుత్వం అన్ని రకాల విఫలమైంది. భూస్వాములకు రక్షణ కల్పిస్తుందే గానీ, మన పేద ప్రజల గోడు పట్టించుకోదు. మీ వంటి అమాయక ప్రజలను చూస్తే నాకు జాలేస్తుంది. మిమ్మల్ని ఉద్ధరిస్తున్నామని చెప్పుకుంటూ చాలామంది పెద్దవాళ్ళు ఇంకా పెద్ద వాళ్ళయిపోయారు. అధికారాలు చేజిక్కించుకొని అందలాల మీద తిరుగుతున్నారు. మీరింక దేనికీ భయపడనవసరం లేదు. మీకు అండగా నే నున్నాను. ప్రతి పనికి మీ ముందు నేను నిలుస్తాను. నాకు కావలసింది మీలో ఐక్యత. అర ఎకరా బీడులో కనీసం పుట్టెడు వేరుసెనగ పండించవచ్చు. సంవత్సరానికి రెండు వేలు వరుమానం. ఆరు నెలలు కష్టపడితే చాలు." గంగరాజు సిగరెట్ పొగ దమ్ము గట్టిగా లాగుతూ అన్నాడు.

అతని మాటలకు జనులకు నోళ్ళు వూరాయి. దాదాపు అందరూ లొట్టలు వేశారు.

"తమరి ఆలోచన మహా గొప్పగా ఉంది. తమరు మాకు నాయకులుగా నిలబడండి. మీరేం చేస్తే అది చేస్తాం." పెద్దయ్య ముందుకొచ్చి అన్నాడు.

"ఇప్పుడు ఆవేశంగా మాటలు చెప్పడం కాదు. రేపు దేనికైనా తెగించ గలిగే ధైర్యం ఉండాలి." గంగరాజు చిటికె వేసి సిగరెట్ నుసి నేల రాల్చాడు.

"ప్రాణాలకైనా తెగిస్తాం. మేం పోయినా మా కుటుంబాలు బాగు పడతాయి. ఇన్నాళ్ళు ఒకరికింద చాకిరీ చేసి వెర్రి నాగన్నలలా బతికాం. ఇక ముందు మేము భూస్వాముల మనిపించుకుంటాం." పెద్దయ్య పంచ ఎగబట్టి అన్నాడు.

గంగరాజు ఉపన్యాసం అతని మెదడులో బాగా పని చేసింది.

సూరన్న మాత్రం వేప చెట్టు వేరు మీద కూర్చుని అందరూ చెప్పేది శ్రద్ధగా వింటున్నాడు. అతన్ని గమనించాడు గంగరాజు.

"ఏమోయ్, సూరన్నా! నీవంత ఉత్సాహంగా కనిపించడం లేదే?" నవ్వుతూ చమత్కారంగా అడిగాడు గంగరాజు.

"ఉత్సాహమేముంది? నీవేదో మాటల గారడీ చేస్తుంటే, అందరితో పాటు నేను చూస్తున్నాను."

"నా మాట మీద నీకు నమ్మకం లేదా?" గంగరాజు ముఖం తీవ్రంగా మారిపోయింది.

గంగరాజు అక్కడున్న జనులందరికీ ఒక దేవుడిలా, ఆపద్బాంధవుడిలా కనిపిస్తున్నాడు.

సూరన్న ఏమీ మాట్లాడకుండా అక్కడినుండి లేచి వెళ్ళిపోయాడు.

"బతకను చేతగాని వాడు." హేళనగా అన్నాడు గంగరాజు. అతని చిట్కాకు అందరూ నవ్వారు.

"ఇలాంటి నాయాళ్ళు కొందరుండబట్టే మా బతుకులు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్లున్నాయి. వాడితో మీకెందుకు సార్, మీరు చేయదల్చుకున్నది చేయండి. మా హరిజనవాడ తరపున నేను హామీ ఇస్తున్నాను—మీకు అండగా మేం నిలుస్తాం." పెద్దయ్య వెన్ను నిరుచుకుని చెప్పాడు.

"సరే! అంతా బాగానే ఉంది. ముందు అతి ముఖ్యమైన విషయాలు రెండు మీరు చేయవలసి ఉంది. ఒకటి—రేపు ఎలెక్షన్లలో నోట్లు నేను చెపే

అభ్యర్థికే వెయ్యాలి. రెండు—మీరు కుటుంబానికి పది రూపాయల చొప్పున వసూలు చేసి నా కివ్వాలి. ఇదంతా నాకోసమే అనుకుంటారేమో? మీ కష్టపు సొమ్ము నాకు పైసా వద్దు. ఉన్న ఆస్తివంతా ఇలాంటి ధర్మకార్యాలకు పోగొట్టుకున్నాను. నాకే గనుక స్వార్థం ఉంటేనా, నా చేతి డబ్బు ఖర్చు పెట్టుకొని ఉండేవాడిని. డబ్బు దేముంది? ఈరోజు ఉంటే రేపు పోతుంది.'' గంగరాజు అన్నాడు అందరి ముఖాలను పరిశీలనగా చూస్తూ.

అందరూ ఒకరి ముఖా లొకరు చూచుకొంటున్నారు.

''ఏం—నన్ను అనుమానిస్తున్నారా?''


''లేదు... లేదు.''' అందరూ ముక్తకంఠంతో జవాబిచ్చారు.

''అయితే మరేమిటి? మనం ఆక్రమించుకొనేది పట్టా పొలం. మనకు రెవిన్యూ అధికారుల అండ కావాలి. పోలీసుల రక్షణ కావాలి. దీనికంతా కొంత ఖర్చవుతుంది. అయినా ఎకరా అయిదు వేలు కిమ్మత్తు చేసే పొలం మీ కొనుక్కున్నప్పుడు మనిషికి పది రూపాయలు ఒక లెక్కా?''

గంగరాజు సమ్మోహనాస్త్రంతో అందరి ముఖాలు మళ్ళీ వికసించాయి.

''అదెంత భాగ్యం, సార్! నే నేర్పాటు చేస్తాను.''






పెద్దయ్య అన్నాడు.

"అయితే, పెద్దయ్యా! మీలో ఎవరన్నా చదువుకున్న కుర్రాడి నొకణ్ణి పిలిచి, మీ హరిజనవాడలోని కుటుంబాలలో నూరు మంది పేర్లు తయారు చెయ్యి. వాళ్ళందర్నీ వచ్చే ఆదివారం ఉదయానికి సిద్ధం చేసి పెట్టు. నేను వచ్చి ఉద్యమం నడిపిస్తాను. ఆ రాజారెడ్డి ఏభై ఎకరాల బీడుకు గుడ్లు పెట్టి ఆక్రమించేద్దాం" అని పైకి లేచాడు గంగరాజా.

అందరూ గంగరాజుకు నమస్కారం చేశారు. గంగరాజు అక్కడ నుండి బయలుదేరాడు. వెనుకనే పెద్దయ్య కొంత దూరం వచ్చాడు.

"చూడు, పెద్దయ్యా! రేపు సాయంత్రానికి డబ్బు చక్క చేసుకుని నీవు మా ఇంటి కొచ్చేసెయ్. అప్పో సప్పో చేసైనా డబ్బు సమకూర్చండి— తెలిసిందా! నీవు రేపు మా వూరు వస్తేనే, నేను పోలీసోళ్ళతో, రెవిన్యూ వాళ్ళతో మాట్లాడగల్గుతాను. తెల్సిందా?" అన్నాడు గంగరాజా.

"అలాగే, బాబుగారూ. మరి నేను సెలవు తీసుకుంటాను" అని వెనక్కు తగ్గాడు పెద్దయ్య.

పార భుజాన వేసుకొని వస్తూ ఎదురయ్యాడు సూరన్న.

"ఏరా, సూరన్నా! పది రూపాయలు కట్టి నీవు మెంబరు అవుతావా? లేక అన్యాయంగా అర ఎకరా పొలం పోగొట్టుకుంటావా?" పెద్దయ్య అతన్ని నిలేసి అడిగాడు.

"పోరి వెర్రి నాయనాళ్ళారా! మిమ్మల్ని ఆ భగవంతుడే రక్షించాలిరా! నీ సొంతమనుకున్న దానిని నీవెలా వదులుకోలేవో, ఈ భూకామందులు కూడా అంతేరా. మన గవర్నమెంటు సీలింగ్ చట్టం పెట్టి, పెద్దోళ్ళ దగ్గర భూమిని లాగేసిందిగా. ఉలాంటి చట్ట ప్రకారం మన మేదైనా చేయగలంగానీ, ఇలా వాడెవడో పోరంబోకు వాడు చెప్పాడని వెళ్ళి వాళ్ళ భూమి మీద కాలేస్తే ఆ ఆసామీ వూరుకుంటాడా? మన మీద కేసు పెడ్తాడు. లేకపోతే కోర్టుకు లాగుతాడు. అప్పుడు మనకున్న దంతా వూడ్చి పెట్టినా ఆ కేసుల నుండి బయట పడలేము. నా మాట విని, ఈ ఆలోచన మానుకో. మన కష్టం మనకు తప్పదు. మన గంజి భగవంతుడు మన కేర్పరచి పెట్టే ఉంటాడు." సూరన్న అనేసి వెళ్ళి పోయాడు.

గంగరాజా మాటలతో మత్తెక్కి ఉన్న పెద్దయ్యకు సూరన్న చెప్పింది తలకెక్కలేదు. తన ధ్యాసలో తాను వచ్చేశాడు.

హరిజనవాడ వదిలిన గంగరాజా సరాసరి గ్రామానికి వచ్చాడు.

"ఇక్కడ రాజారెడ్డి గారిల్లెక్కడయ్యా?" ఎదురు పడిన ఒక పాలికాపును అడిగాడు గంగరాజా.

"ఆ కనిపించే పెద్ద గోపిరంగు మిద్దే" అని చెయ్యెత్తి కొస తిరుగుడులో ఉన్న ఒక మిద్దెను చూపించి, ముందుకు సాగిపోయాడు ఆ పాలికాపు.

గంగరాజా జోబీ నుండి సిగరెట్ ప్యాకీ తీసి, సిగరెట్ వెలిగించుకుని, ఆ గోపీ రంగు మిద్దెముందు నిల్చున్నాడు.

"ఎవరు కావాలండీ?" లోపల వరండాలో కుర్చీలో కూర్చుని ఉన్న పదహారేళ్ళ కుర్రాడు పలకరించాడు.

"రెడ్డి గారున్నారా?" అడిగాడు గంగరాజా.

"మా నాన్నగారా?" అడిగా డా కుర్రాడు.

"అవును."

"ఉన్నారు లోపలికి రండి" అని ఆహ్వానించాడు.

గంగరాజా ధీమాగా లోపలికి నడిచి, వరండాలోని పేము కుర్చీలలో ఒక దానిలో కూర్చున్నాడు.

ఆ అబ్బాయి లోపలి కెళ్ళిపోయాడు.

అయిదు నిముషాల తరవాత రాజారెడ్డి గుమ్మంలో ప్రత్యక్షమయ్యాడు.

"నమస్కారం రెడ్డిగారూ" పైకి లేచి నమస్కారం పెట్టాడు గంగరాజా.

"ఎవరు మీరు?" అంతకుముందెప్పుడూ గంగరాజాను చూడక పోవడం వల్ల రాజారెడ్డి ప్రశ్నించాడు.

"నా పేరు గంగరాజా మాది అసలు గుంటూరు జిల్లా. ప్రస్తుతం ఈ జిల్లాలోనే ఉంటున్నాను." గంగరాజా తనను తాను పరిచయం చేసుకున్నాడు.

"నాతో ఏదైనా పని ఉండి వచ్చారా?" పక్కన ఉన్న కుర్చీలో కూర్చుంటూ అడిగాడు రాజా రెడ్డి.

"నేను... పార్టీ కార్యకర్తను దీనజనోద్ధరణ చేస్తుంటాను. మీ గ్రామం హరిజనులు నన్ను అత్యవసరంగా రమ్మని కబురు చేస్తే వచ్చాను. వాళ్ళు చెప్పింది విన్న తరవాత మీ కొచ్చిన కష్టం గూర్చి మీకు తెలియ చెయ్యాలని వచ్చాను."

23—4—86

"ఏమిటండీ ఆ కష్టం?" కాస్త ముందుకు వంగి అడిగాడు రాజారెడ్డి.

"మీ సర్వే నంబరు అరవై ఆరులోని ఏభై ఎకరాల భూమిని. భూమి ఆక్రమణ ఉద్యమం కింద ఆక్రమించాలనుకుంటున్నారు. దాదాపు వంద మంది హరిజనుల లిస్టు తయారు చేసుకొని ఉన్నారు." గంగరాజా సిగరెట్ పొగ మెల్లిగా గాలిలోకి వదులుతూ బదులిచ్చాడు.

"అదెలా సంభవం? అది నా పట్టాపొలం."

"ఈ కాలంలో సంభవా సంభవాలు ఎవరాలోచిస్తుంది? రెడ్డిగారూ. ప్రజలు చైతన్యవంతులయ్యారు. అయినా నేను వాళ్ళకు నచ్చ చెప్పాననుకోండి. వాళ్ళతో మీరు రాజీ పడితే బాగుంటుంది." గంగరాజా అన్నాడు.

"రాజీ పడడానికి నేనేం వాళ్ళతో కయ్యానికి కాలు దువ్వలేదు కదా?" రాజారెడ్డి గొంతుకలో కాస్త తీవ్రత కనిపించింది.

"అంత మాట అనకండి. ఇలాంటి వ్యవహారాలన్నీ చాలా సామరస్యంతో పరిష్కరించుకోవాలి. మీరు కోర్టుకెళ్ళవచ్చు. డబ్బు ఖర్చు పెట్టవచ్చు. ఇంజంక్షన్ ఆర్డర్ తేవచ్చు. కానీ ఇదంతా తిప్పట. డబ్బు ఖర్చు గోటితో పోయే దానికి గొడ్డలి ఎందుకు?" గంగరాజా మెల్లిగా అడిగాడు.

"అయితే నన్నేం చేయమంటారు?" అతని వాదన అంగీకరిస్తున్నట్లు అడిగాడు రాజారెడ్డి.

"వాళ్ళకు మనిషికి ఏభై రూపాయల లెక్కన ఇచ్చేయండి." తాపీగా అన్నాడు గంగరాజా.

"అంటే ఉచితార్థంగా వస్తున్న అయిదు వేలు ఖర్చు పెట్టమంటారా?" కళ్ళు పెద్దవి చేసి అడిగాడు రాజారెడ్డి.

"మీ రీ వ్యవహారం నుండి బయట పడడానికి మీకు అంతకు రెట్టింపే అవుతుంది. పార్టీ నాయకుడుగా వాళ్ళను నేను అణచి పెట్టగలను."

"ప్రతిసారీ వాళ్ళిలాగే చేయరన్న నమ్మకమేమిటి?" రాజారెడ్డి అనుమానం బయట పెట్టాడు.

"అలా జరగదని నేను హామీ ఇస్తున్నాను."

రాజారెడ్డి కొంత తడవు ఆలోచించాడు. ఇక తప్పదనిపించినట్లుంది. లోపలికెళ్ళి అయిదు వేల రూపాయలు తెచ్చి గంగరాజా చేతిలో ఉంచాడు.

"మీ కింకేమీ భయం లేదు. మీరు నిశ్చింతగా ఉండవచ్చు" అని పైకి లేచి, ఆ నోట్ల కట్టను లాల్చీ జేబీలో కుక్కి, రాజారెడ్డికి ఒక నమస్కారం పెట్టి, అక్కడ నుండి బయలుదేరాడు గంగరాజా.

రాజారెడ్డి మంత్రముగ్ధుడిలా చూస్తూండి పోయాడు.

రెండు రోజుల తరవాత పెద్దయ్య హరిజన కుటుంబాల వద్ద డబ్బు వసూలు చేసి, వెయ్యి రూపాయలు తీసుకుని గంగరాజా ఇంటికొచ్చాడు.

గంగరాజా డబ్బు తీసుకుని, లెక్కేసుకుని "చూడు, పెద్దయ్యా! వ్యవహారం చాలా పకడ్బందీగా జరగాలి. వచ్చే ఆదివారం ఉదయానికి సద్దన్నం తిని, అందరూ సర్వే నంబరు అరవై

ఆరు వద్ద గుమిగూడండి. నేను సరాసరి అక్కడి కొచ్చేస్తాను. ఒక గంటలో కార్యక్రమం పూర్తవుతుంది. సరేనా! నీవే అందరినీ జాగ్రత్తగా అక్కడకు చేర్చు. నీవు పెద్ద మనిషివి. అందరూ నీ మాట గౌరవిస్తారు. నేను మొన్న చూశానుగా ఒక అర గంటలో హరిజన వాడనంతా నా ముందు నిలబెట్ట గలిగావు." గంగరాజు చేతిలో సైకిల్ పంపు లేకుండానే పెద్దయ్యకు గాలి కొట్టాడు. పెద్దయ్య ఉబ్బిపోయాడు.

"అంతా తమ దయ. అలాగే ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు మేమంతా సర్వే నంబరు అరవై ఆరులోని బీడు వద్ద సిద్ధంగా ఉంటాము. మీరు రొచ్చేయండి." పెద్దయ్య ఉత్సాహంగా అన్నాడు.

"అమ్మో! నేను రాకుండానా? ఒక వేళ నేను రావడం ఆలస్యమైతే మీరు వెనకాడవద్దు. ముందు పొలం మీద దిగి గట్లు ఏర్పరిచేయండి. గట్లు ఏర్పరిచారంటే మీరు భూమిని ఆక్రమించినట్లే లెక్క. తరవాత ఏ కోర్టు స్టే వచ్చినా చెల్లదు." వివరించాడు గంగరాజు.

"సరే" నని తలూపి అక్కడ నుండి ఉత్సాహంగా కదిలాడు పెద్దయ్య.

* * * *

ఆ రోజు ఆదివారం— ఉదయం తొమ్మిది గంటలు.

ఆ గ్రామ హరిజన వాడ మొత్తం ఉప్పొంగించిన ఉత్సాహంతో సర్వే నంబరు అరవై ఆరు వైపు బయలుదేరారు.

వాళ్ళు వినాదాలు చేసుకుంటూ తీరా పొలం వద్దకొచ్చేసరికి, పొలం పక్కన ఒక వ్యాన్ నిండా సాయుధులైన పోలీసులు కనిపించారు. వినాదాలు ఒక్కసారిగా ఆగిపోయాయి. వీళ్ళ అగడాన్ని ముందు రోజు రాత్రే పసిగట్టిన రాజారెడ్డి పోలీసుల రక్షణ కోరిన విషయం ఆ అమాయకులకు తెలియదు, పాపం.

ఆడ, మగ, అందరూ నివ్వెరపోయారు. ఒకసారి వెనక్కు తిరిగి చూచారు. తమను జాగృత పరిచిన గంగరాజు జాడ ఎక్కడా కనిపించ లేదు.

"ఇప్పుడేం చేద్దాంరా?" పక్కన ఉన్న వెంగన్న పెద్దయ్య నడిగాడు.

పెద్దయ్య ముహోద్యమలో తలూపి, "మనం పొలంలో దిగి గట్లు వేసేశామంటే, పొలం మనదై పోతుంది. అందువల్ల, అందరూ పొలంలోకి దిగండి" అని పెద్దగా అరిచాడు పెద్దయ్య.

ముందు ఆడవాళ్ళు, వాళ్ళ వెనుక మగవాళ్ళు పొలంలోకి దిగారు.

"ఆగండి! మీ రీ పొలంలోకి దిగడానికి వీలు లేదు. ఇది ఒక ఆసామీ స్వంత భూమి. మీరు అతిక్రమించి దిగారంటే మిమ్మల్ని అరెస్టు చేయవలసి వస్తుంది." హెచ్చరించాడు పోలీసు ఇన్‌స్పెక్టర్.



చెరువు గట్టున ...

ఫోటో—ఎల్. ఆర్. గ్రోవర్

"అవంతా లెక్క చేయకండి. వాళ్ళ వద్ద ఉన్నవి ఉత్తుత్త తుపాకులు. అవి మనల నేమీ చెయ్యవు. అదిగో—ఆ గుట్టలోని రాళ్ళు తీసి వాళ్ళ మీదకు విసరండి. మన దెబ్బలకు తట్టుకోలేక వాళ్ళు పరుగెత్తుకెడతారు." పెద్దయ్య అరిచి అరిచి చెప్పాడు.

అంతే—గుంపులోని జనం ఒక్కసారిగా రాళ్ళ గుట్ట వైపు పరుగులు తీశారు. కళ్ళు మూసి తెరిచేంతలో పోలీసులపై రాళ్ళ వర్షం కురవసాగింది. పోలీసు వ్యాన్ అద్దాలు తునాతునకలైనాయి. చాలా మంది పోలీసులకు నుదుట రాళ్ళు తగిలి రక్తం స్రవించసాగింది.

జనంలో కోలాహలం... చెప్పలేని ఉత్సాహం... రాళ్ళ గుట్ట నిమిషంలో సగానికి పైగా కరిగి పోయింది. పోలీసుల హెచ్చరికలు వాళ్ళకు వినిపించ లేదు.

"ఫైర్!" పోలీసాఫీసరు పెద్దగా అరిచాడు.

పోలీసు కానిస్టేబుల్ చేతిలోని తుపాకి ఆ జనం మీద గురి పెట్టబడింది. మరుక్షణం గుళ్ళు పేళ్ళి జనం మీద పడ్డాయి. తుపాకి శబ్దంలో చెట్ల మీది కాకుల్లా జనం చెల్లా చెదురుగా పరుగులు తీయసాగారు. తుపాకి గుండ్లు వృథా పోలేదు. ఒకటి పెద్దయ్య గుండె మీద జారబడింది. పెద్దయ్య నేల కొరిగి పోయాడు. మరొక గుండు ఒక స్త్రీకి కుడి భుజంలో దూసుకు పోయింది. పోలీసులు తరిమి తరిమి పట్టుకుని కొందరిని వ్యాన్‌లో ఎక్కించారు. గాయపడిన పెద్దయ్యను, ఆ స్త్రీని హాస్పిటల్‌కు తీసుకుని వచ్చారు. కానీ పెద్దయ్య హాస్పిటల్‌లో కన్ను మూశాడు. చనిపోయినప్పుడు అతని కళ్ళలో ఆరనికాగా ఆశ మాత్రం నిశ్చలంగా ఉండిపోయింది. గాయపడిన స్త్రీకి కుడి చెయ్యి తీసెయ్యడం వల్ల ఆమె అవిటిదైంది. ఆ ఉద్యమం ఆ రకంగా పరిసమాప్తి అయింది.

ఆ తరవాత పెద్దయ్యను, రాజారెడ్డి సర్వే నంబరు అరవై ఆరును ఆ హరిజనులు పూర్తిగా మరిచిపోయారు.

గంగరాజు మాత్రం ఇలాంటి ఉద్యమాలు చాలా వూళ్ళలో నిర్వహించాడు. పార్టీ కార్యకర్తగా పేరు తెచ్చుకున్నాడు. నాలుగు డబ్బులు వెనక వేసుకున్నాడు. పెద్దయ్య వంటి అమాయకులు వున్నంత వరకు గంగరాజు వంటి వారికి జీవనోపాధి సమస్య లేదు. *